


ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

పాత శ్రీకాకుళం, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు డీఈవో ఎ.రవిబాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 'అర్హులైన ఉపాధ్యాయులు ఈ నెల 17 నుంచి 24లోగా డీఈవో కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలి. ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులు ఎంఈవోల ద్వారా, ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు ఉపవిద్యాశాఖ అధికారుల ద్వారా దరఖాస్తులు సమర్పించాలి. మరిన్ని వివరాలకు 94924 23420 నెంబర్‌ను సంప్రదించాల'ని డీఈవో రవిబాబు సూచించారు.

కరిగిన నిధులు.. చెదిరిన దారులు!

- కొండపై గిరిజన గ్రామాల్లో పూర్తికాని రోడ్లు
- ఏటా మెటల్, పిండిరాయి వేసి వదిలేస్తున్నారు
- వర్షాకాలంలో కొట్టుకుపోతున్న వైనం
- పనులు పూర్తిచేయాలని డిప్యూటీ సీఎం ఆదేశం



ఇటీవల వర్షానికి కొట్టుకుపోయిన గూడ గ్రామ రహదారి

● మెళియాపుట్టి మండలంలో కొండపై ఉన్న కేరాశింగి నుంచి గూడ గ్రామానికి సుమారు 2.50 కిలోమీటర్లు దూరం. ఈ మార్గంలో రహదారి పనులకు రూ.1.50 కోట్లు గతంలో మంజూరయ్యాయి. వైసీపీ ప్రభుత్వ పాలనలో కొంతమేర మట్టి పనులు చేసి.. మీద మెటల్, రాయి పిండి వేసి వదిలేశారు. బిల్లులు జరిగినా పనులు పూర్తికాలేదు. తరచూ పడుతున్న వర్షాలకు రోడ్డుపై వేసిన మెటల్‌తోపాటు రాయిపిండి కొట్టుకుపోతోంది. దీంతో రహదారి పనులు మళ్లీ మొదటికి వచ్చాయి. నిధులు చాలక మళ్లీ రూ.92లక్షలు మంజూరు చేశారు. కానీ ప్రస్తుతం రాయిపిండి వేసి వదిలేశారు. నిధులు ఖర్చు చేస్తున్నా పనులు పూర్తికాకపోవడంతో గిరిజనులు ఆందోళన చెందుతున్నారు. ఏటా వర్షాలకు మెటల్, రాయిపిండి కొట్టుకుపోతోందని పేర్కొంటున్నారు. మళ్లీ వేసవిలో రాయిపిండి వేసి బిల్లులు చేసుకుంటున్నారు కానీ సీసీ రోడ్డు మాత్రం నిర్మించడం లేదని వాపోతున్నారు.



కేరాశింగి గ్రామ రహదారి ఇలా..

● మెళియాపుట్టి మండలం ముఖందుపురం నుంచి కేరాశింగి గ్రామానికి 2017 నుంచి రహదారి పనులు జరుగుతున్నా, ఇప్పటివరకూ పూర్తికాలేదు. ఈ రహదారికి మొదట్లో మట్టి పనులకు రూ.42 లక్షలు మంజూరయ్యాయి. మళ్లీ 2019లో వైసీపీ ప్రభుత్వం 3.60 కిలోమీటర్ల మేర సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.1.11 కోట్లు మంజూరు చేసింది. కొంతమేరకు పనులు చేసి వదిలేసింది. మళ్లీ 2023లో 2.40 కిలోమీటర్ల సీసీ రోడ్డుకు రూ.1.50 కోట్లు నిధులు మంజూరు చేసింది. కానీ పనులు పూర్తికాకపోవడంతో గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు.

● ఒక్క మెళియాపుట్టి మండలానికే 57 పనులకు సంబంధించి రూ.23.48 కోట్ల నిధులు మంజూరు చేశారు. అయితే కొంతమంది పాతరోడ్లను యంత్రాలతో తవ్వేశారు. మరికొంతమంది మెటల్ రాళ్లు వేసి వదిలేశారు. దీంతో గిరిజన గ్రామాలకు వెళ్లాలంటే ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై ప్రభుత్వానికి ఫిర్యాదులు అందడంతో ప్రతీ రెండు వారాలకు ఒకసారి పనులపై సమీక్షించాలని ఇటీవల డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ అధికారులను ఆదేశించారు.

మెళియాపుట్టి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి):

కొండపై గిరిజన ప్రాంత గ్రామాల ప్రజలకు రహదారి కష్టాలు తప్పడం లేదు. గత వైసీపీ ప్రభుత్వం రహదారి పనులను వదిలేసింది. దీంతో గిరిజనులు ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. రేషన్ సరుకులు, వైద్యసేవలు కోసం కొండపై నుంచి నడిచి కిందకు వచ్చేందుకు ఆపసోపాలు పడుతున్నారు. వైద్యసేవలు అత్యవసరమైతే డోలీ మోతతో కిందకు దింపుతున్నారు. డోలీ మోతలు లేని గ్రామాలు చూడాలనే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం రహదారుల నిర్మాణంపై దృష్టి సారించింది. సీతంపేట ఐటీడీఏ పరిధిలో 145 గ్రామాలకు సరైన రహదారులు లేవని అధికారులు గుర్తించారు. తొలివిడతగా 72 గ్రామాలకు రూ.52.92 కోట్లు నిధులు మంజూరు చేశారు. కాగా.. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఇంజినీరింగ్ అధికారులతో సమీక్షిస్తున్నా ఫలితం లేకపోతోంది. మెళియాపుట్టి మండలంలో అడ్డివాడ గ్రామానికి మాత్రమే పనులు పూర్తి చేశారు. ఇంకా కేరాశింగి, గూడ, చందనగిరి, కుడ్డబ గ్రామాల్లో పనులు పూర్తికాలేదు. కొంతమేర పనులు చేసినా సకాలంలో బిల్లులు కాకపోవడంతో కాంట్రాక్టర్లు మధ్యలోనే వదిలేస్తున్నారు. ఇటీవల డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఇంజనీరింగ్ అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. కొండపై గిరిజన గ్రామాలకు రహదారులు పూర్తిచేయాలని ఆదేశించారు. దీంతో కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించే అవకాశం ఉంది. కానీ ప్రస్తుతం వర్షాకాలం కావడంతో కొండలపై రహదారి పనులు మళ్లీ సంక్రాంతి తర్వాతే జరిగే సూచనలు కనిపిస్తున్నాయి. కాగా.. మెటల్, రాయిపిండి వేసి వదిలేస్తుండడంతో వర్షాల సమయంలో రహదారులు కొట్టుకుపోతున్నాయని, నిధులు వృథా అవుతున్నాయని గిరిజనులు ఆరోపిస్తున్నారు. ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి సీసీ రోడ్లు నిర్మించేలా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

ఇంజనీరింగ్ శాఖలో కదలిక వచ్చేనా?

సీతంపేట ఐటీడీఏ ఇంజనీరింగ్ శాఖలో అధికారుల నిర్లక్ష్యం కారణంగా రహదారుల పనులు పూర్తికావడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. బంధువుల పేరుతో నిబంధనలకు విరుద్ధంగా పనులు చేశారనే కారణంతో గతంలో పాతపట్నం సెక్షన్ ఏఈ శ్రీకాంత్ సస్పెన్షన్ అయిన విషయం తెలిసిందే. ఇటీవల ఐటీడీఏ ఈఎన్‌సీ శ్రీనివాసరావు ఏసీబీకి చిక్కారు. సీతంపేటలో ఇద్దరు ఈఈలు కేవీఎస్ఎన్ కుమార్, రమాదేవి విధులు నిర్వహిస్తున్నారు. రమాదేవికి ఇటీవల నెల్లూరు ఐటీడీఏకు బదిలీ చేశారు. ఆమె న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో బదిలీ నిలిపేశారు. అప్పటికే ప్రభుత్వం విజయవాడ ఈఎన్‌సీ కార్యాలయంలో పనిచేస్తున్న కుమార్‌ను సీతంపేట ఈఈగా నియమించింది. దీంతో ఇక్కడ ఇద్దరు ఈఈలు విధులు నిర్వహిస్తుండగా, వారి మధ్య అంతర్గత కుమ్ములాటతో ఓ వైపు సిబ్బంది నలిగిపోతున్నారు. మరోవైపు పనులు ముందుకు సాగడం లేదు. కొంతమంది అధికారపార్టీ నాయకులు ఇంజనీరింగ్ శాఖ అధికారులకు అండగా నిలుస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కాగా ఇప్పటికే (మిగతా 6వ పేజీలో..)



గౌతు లచ్చన్న విగ్రహానికి నివాళి అర్పిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎమ్మెల్యే శంకర్, మాజీ మంత్రి శివాజీ

'సర్దార్' సేవలు భావితరాలకు స్ఫూర్తిదాయకం

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్
- ఘనంగా గౌతు లచ్చన్న జయంతి

శ్రీకాకుళం కలెక్టరేట్, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమర యోధుడు సర్దార్ గౌతు లచ్చన్న సేవలు, పోరాటాలు భావితరాలకు స్ఫూర్తిదాయకమని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ పేర్కొన్నారు. గౌతు లచ్చన్న 116వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శనివారం శ్రీకాకుళంలోని డే అండ్ నైట్ కూడలి వద్ద ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే గొండు.శంకర్, మాజీమంత్రి గౌతు శ్యామసుందర శివాజీలతో కలిసి కలెక్టర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ 'రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు గౌతు లచ్చన్న జయంతిని అధికారిక కార్యక్రమంగా నిర్వహించాం. స్వాతంత్ర్య పోరాట సమయంలో, తర్వాత బీసీలకు రిజర్వేషన్లు రావడంలో ఆయన అత్యంత కీలకంగా వ్యవహరించార'ని తెలిపారు. మాజీమంత్రి గౌతు శివాజీ మాట్లాడుతూ తన తండ్రి, గౌతు లచ్చన్న జయంతిని రాష్ట్ర ప్రభుత్వం అధికారిక కార్యక్రమంగా నిర్ణయించడం సంతోషదాయకమన్నారు. నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి మాట్లాడుతూ స్వాతంత్ర్య ఫలాలు బడుగు, బలహీన వర్గాలకు చేరాలనే ఆశయంతో లచ్చన్న ఎనలేని కృషి చేశారని తెలిపారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా అందరం నడుచుకోవాలని కోరారు. శ్రీకాకుళం (మిగతా 6వ పేజీలో..)

నెరవేరిన ఆశ

- ఆశా కార్యకర్తలకు మూడు వరాలు
- ప్రసూతి సెలవులు, గ్రాట్యుటీ మంజూరు
- 62 ఏళ్లకు పదవీ విరమణ పెంపు
- ప్రభుత్వ నిర్ణయంపై హర్షం

ఇచ్ఛాపురం, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): ఆశా కార్యకర్తలకు రాష్ట్ర ప్రభుత్వం వరాలు ప్రకటించింది. కొన్నాళ్లుగా వారు డిమాండ్ చేస్తున్న మూడు హామీలు అమలు చేయాలని నిర్ణయించింది. ప్రసూతి సెలవులను 180 రోజులు ప్రకటించింది. తొలి, రెండో ప్రసవాలకు మూడేసి నెలలు చొప్పున వేతనంతో కూడిన సెలవులను మంజూరు చేయనుంది. అలాగే సర్వీసు పూర్తిచేసుకున్న వారికి గ్రాట్యుటీని రూ.1.50 లక్షలు ఇచ్చేందుకు నిర్ణయించింది. పదవీ విరమణ వయసును 60 నుంచి 62 ఏళ్లకు పెంచింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కృష్ణబాబు ఇటీవల ఉత్తర్వులు జారీచేశారు. ప్రభుత్వ నిర్ణయంతో జిల్లాలో 2,785 మంది ఆశా కార్యకర్తలకు లబ్ధి చేకూరనుంది. ప్రస్తుతం వీరికి గౌరవ వేతనంగా నెలకు రూ.10వేలు అందిస్తున్నారు. వైద్య ఆరోగ్య శాఖ సిబ్బందితో సమానంగా గ్రామస్థాయిలో ఆరోగ్యప రంగా ఆశా కార్యకర్తలు సేవలందిస్తున్నారు. వైసీపీ పాలనలో ఆశా కార్యకర్తలపై తీవ్ర నిర్లక్ష్యం కొనసా గింది. 2019 ఎన్నికలకు ముందు ఎన్నెన్నో హామీలు ఇచ్చిన జగన్ అధికారంలోకి వచ్చిన తరువాత మరిచి పోయారు. ఉద్యోగ భద్రత లేదు. సమాన పనికి సమాన వేతనం లేదు. ఆపై కరోనాలాంటి కష్టకాలం లో సేవలందించి ఎంతోమంది ప్రాణాలు కోల్పో యారు. ముందు ప్రభుత్వాలు అందిస్తున్న రాయితీను సైతం నిలిపివేశారు. దీంతో ఆశాకార్యకర్తలు ఆందోళన చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సార్వత్రిక ఎన్నికల సమమంలో.. తాము అధికారంలోకి వస్తే ఆశా కార్యకర్తల సమస్యలు పరిష్కరిస్తానని టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారు. ఈ మేరకు తాజాగా ప్రసూతి సెలవు, గ్రాట్యుటీ, పదవీ విరమణ వయసు పెంపు అమలు చేయనున్నట్టు ప్రకటించడంతో ఆశా కార్యకర్తలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. అలాగే తమ గౌరవ వేతనాన్ని కూడా పెంచాలని కొంతమంది ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.



ఇచ్ఛాపురం సీహెచ్‌సీలో ఆశావర్కర్లు (ఫైల్)

ప్రభుత్వానికి కృతజ్ఞతలు

దశాబ్దాలుగా వెట్టిచాకిరీ చేస్తున్నాం. కరోనాలాంటి కష్టకాలంలో కూడా సేవలందించాం. వైసీపీ సర్కారు మాటలతో కాలం గడిపేసింది. సమస్యలు పరిష్కరించాలని ఎన్నిసార్లు ఆందోళన చేసినా ఫలితం లేకపోయింది. మా సమస్యలను గుర్తించి.. పరిష్కారానికి చొరవ చూపిన కూటమి ప్రభుత్వానికి కృతజ్ఞతలు.

-ఇందిర, ఆశా కార్యకర్త, ఇచ్ఛాపురం

చిరుద్యోగులపై కత్తి!
- ఉద్దానం ప్రాజెక్టులో 104 మంది తొలగింపు
- ఆందోళనలో కార్మికులు

6లో

ఇరుకు గదిలోనే..
- సొంత భవనానికి నోచుకోని ఐసీడీఎస్ కార్యాలయం
- ఇబ్బంది పడుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది

8లో

జనావాసాల్లోకి వానరాలు
- మందస మండలంలో సంచారం

ఆదిత్యుని సేవలో విజిలెన్స్ కమిషనర్

7లో

పాత పెన్షన్ కోసం 25న మహా ధర్నా



నరసన్నపేట పీఏసీఎస్ కార్యాలయం

● జమ్ము గ్రామానికి చెందిన ఒక రైతు యూరియా కోసం ఈ నెల 12న నరసన్నపేట పీఏసీఎస్‌కు వెళ్లాడు. యూరియా సొసైటీకి రాలేదని, వచ్చిన తర్వాత పంపిణీ చేస్తామని సిబ్బంది చెప్పడంతో నిరాశతో వెనుదిరిగాడు. ఇలా గత పదిహేను రోజులుగా సొసైటీ చుట్టూ రైతులు తిరుగుతున్నా.. యూరియాను పంపిణీ చేయడం లేదు. సొసైటీకి వచ్చిన 440 బస్తాల యూరియా ఏమైందో తెలియడం లేదు

ఆ యూరియా.. ఏమైంది?

- నరసన్నపేట పీఏసీఎస్‌లో నిల్వలు పక్కదారి
- పాలకవర్గం, సిబ్బంది తీరుపై అనుమానాలు
- రైతులకు తప్పని ఇబ్బందులు

నరసన్నపేట, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్ వేళ.. నరసన్నపేట మండలంలో యూరియా దొరక్క రైతులు ఇబ్బందులు పడుతున్నారు. నరసన్నపేట ప్రాథమిక సహకార సంఘానికి(పీఏసీఎస్) ఇరవై రోజుల కిందట 440 యూరియా బస్తాలు వచ్చాయి. వీటిని పంపిణీ (మిగతా 6వ పేజీలో..)



శ్రీకాకుళం కల్చరల్ : శ్రీకృష్ణార్జున మందిరంలో ఆకట్టుకున్న చిన్నారుల వేషధారణ

వేడుకగా కృష్ణాష్టమి

- గోపిక, కృష్ణుల వేషధారణల్లో ఆకట్టుకున్న చిన్నారులు
- ఉట్టికొట్టేందుకు యువత పోటీ

6లో



శ్రీకాకుళం : ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తున్న మహిళలు

రైట్.. రైట్

- 'స్త్రీశక్తి'ని సద్వినియోగం చేసుకుంటున్న మహిళలు
- జిల్లాలో ఒక్కరోజే 40వేల మందికి బస్సుల్లో ఉచితంగా ప్రయాణం

6లో

- 'స్త్రీశక్తి'ని సద్వినియోగం చేసుకుంటున్న మహిళలు
- బస్సుల్లో ఉచితంగా ప్రయాణం
- ఒక్కరోజే 40వేల మందికి జీరోఫేర్ టిక్కెట్
- అన్నివర్గాల మహిళల ఆనందం

స్త్రీ శక్తి

రైట్ రైట్



స్త్రీ శక్తి పథకం ఉచిత బస్సు ప్రయాణ టిక్కెట్లను చూపిస్తున్న మహిళలు

శ్రీకాకుళం, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్త్రీ శక్తి పథకంపై మహిళలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. జీరోఫేర్ టిక్కెట్‌తో బస్సుల్లో ఉచితంగా ప్రయాణిస్తున్నారు. శనివారం జిల్లాలోని వివిధ ఆర్టీసీ బస్టాండ్ల వద్ద మహిళా ప్రయాణికులతో సందడి నెలకొంది. బస్సుల్లో ప్రయాణించేందుకు వారు ఉత్సాహం చూపించారు. కండక్టర్లకు ఆధార్ కార్డు, ఇతర గుర్తింపు కార్డులు చూపించి, జీరో చార్జీ టిక్కెట్ తీసుకొని వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగించారు. స్త్రీ శక్తి పథకంపై అన్ని వర్గాల మహిళల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.



బస్సులో ప్రయాణిస్తున్న మహిళలు

జిల్లాలో పరిస్థితి..

జిల్లాలోని శ్రీకాకుళం-1, శ్రీకాకుళం-2, పలాస, టెక్కలి డిపోల పరిధిలో 310 బస్సులు ఉన్నాయి. ఇందులో స్త్రీశక్తి పథకం కోసం 250 బస్సులను కేటాయించారు. ఆగస్టు 15న సాయంత్రం స్త్రీశక్తి పథకాన్ని ప్రభుత్వం ప్రారంభించింది. సాయంత్రం కావడంతో మహిళలు పెద్దసంఖ్యలో వినియోగించుకోలేదు. రెండోరోజు శనివారం జిల్లా వ్యాప్తంగా వంద శాతం ఆక్యుపెన్సీతో బస్సులు నడిచాయి. నాలుగు డిపోల పరిధిలో 40వేలమంది మహిళలు జీరోఫేర్ టిక్కెట్‌తో ఉచితంగా ప్రయాణం చేశారు. ముఖ్యంగా పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ సర్వీసులకు అమాంతం డిమాండ్ పెరిగింది.

● ఇచ్ఛాపురం నుంచి విశాఖపట్నం వరకు ఎక్స్‌ప్రెస్‌లను, శ్రీకాకుళం నుంచి బొబ్బిలి, పలాస, పాతపట్నం వైపు వెళ్లేందుకు పల్లెవెలుగు బస్సులను అధిక మంది మహిళలు వినియోగించుకున్నారు. ఇదివరకు వంద మంది ప్రయాణికులు బస్సుల్లో ఉంటే.. అందులో సుమారుగా 40శాతం మహిళలు ఉండేవారు. ఇప్పుడు వందమంది ప్రయాణికుల్లో 80శాతం మంది వారే ఉంటున్నారు. శనివారం ఒక్కరోజే 40 వేల జీరోఫేర్ టిక్కెట్లు జారీ చేశారు. సోమవారం మహిళా ప్రయాణికుల సంఖ్య మరికాస్త పెరగనుంది.

● మహిళలు ఉచితంగా ప్రయాణించాలంటే జీరో టిక్కెట్ కోసం కచ్చితంగా ఆధార్ లేదా ప్రభుత్వ గుర్తింపు కార్డు ఏదైనా ఉండాల్సిందే. ప్రస్తుతం ఆధార్ జెరాక్స్ కాపీని సైతం ఆర్టీసీ కండక్టర్లు ఆమోదిస్తున్నారు. తొలిరోజున అధికమంది జెరాక్స్ కాపీలను మాత్రమే ఉంచుకున్నారు. వీళ్లందరికీ బస్సుల్లో కండక్టర్లు కౌన్సెలింగ్ ఇచ్చి.. ఇకపై ఒరిజనల్ ఆధార్ కార్డులను కూడా తెచ్చుకోవాలని చెప్పారు. ప్రయాణికులతో దురుసుగా ప్రవర్తించవద్దని, సంయమనంగా ఉండాలంటూ ఆర్టీసీ అధికారులు కూడా కండక్టర్లకు పలు సూచనలు చేశారు. విద్యార్థినులు, యువత, మహిళలు.. ఇలా అన్ని వర్గాల మహిళలు ఉచిత బస్సు సర్వీసును వినియోగించుకున్నారు. తమవారు బస్సుల్లో ఉచిత ప్రయాణం చేస్తున్నారని తెలిసి.. ఆయా కుటుంబ సభ్యులు కూడా సంతోషంగా బస్సు వద్దకు వచ్చి.. మహిళలకు వీడ్కోలు పలకడం అంతటా కనిపించింది.

ఆనందంగా ఉంది..



కొల్లివలసలో నా కుమార్తె నివసిస్తోంది. ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణం అందుబాటులోకి రావడంతో నా కుమార్తెను చూసేందుకు శ్రీకాకుళం నుంచి కొల్లివలస వెళ్తున్నాను. ఉచిత ప్రయాణ అవకాశం మాకు ఎంతో ఆనందంగా ఉంది.

-గేదెల రాజు, శ్రీకాకుళం

ఎంతగానో ప్రయోజనం..



మేము గ్రామాల నుంచి శ్రీకాకుళం నగరంలో చదువుతున్నాం. నెలవారీ బస్ పాస్‌లు.. లేదా ఆటో కోసం చాలా డబ్బులు వెచ్చించాల్సి వచ్చేది. ఇప్పుడు ఆ సమస్యలేదు. ఆర్టీసీ బస్సులో ఉచిత ప్రయాణంతో మాకు ఎంతగానో లబ్ధికలిగింది. మహిళా లోకానికి ఆర్థికంగా ప్రయోజనం కలిగింది. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి ధన్యవాదాలు.

-శౌర్య, వాణిశ్రీ, మాధవి, విద్యార్థినులు

'సర్దార్' సేవలు భావితరాలకు స్ఫూర్తిదాయకం

(ఐదో పేజీ తరువాయి)

ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ 'దేశంలోనే జిల్లాకు గుర్తింపు తీసుకువచ్చిన మహోన్నత నాయకుడు. దేశంలో సర్దార్ అనే బిరుదు ఇద్దరికే వచ్చింది. అందులో ఒకరు వల్లభాయ్ పటేల్ కాగా, మరొకరు 'సర్దార్ గౌతు లచ్చన్న' అని తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ డి.పృధ్వీరాజ్‌కుమార్, ఆర్డీవో కె.సాయి ప్రత్యూష, మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ పైడిశెట్టి జయంతి, కార్పొరేషన్ కమిషనర్ ప్రసాదరావు, బీసీ వెల్ఫేర్ అధికారి అనూరాధ, టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

కరిగిన నిధులు.. చెదిరిన దారులు!

(ఐదో పేజీ తరువాయి)

రూ.20.36 కోట్ల నిధులతో 16 రోడ్ల పనులను ఐటీడీఏ శాఖ నుంచి పంచాయతీరాజ్ శాఖకు కలెక్టర్ బదలాయించారు. మిగిలిన పనులైనా ఎంతవరకు చేస్తారో వేచిచూడాలి.

కష్టాలు తప్పడం లేదు..



15 ఏళ్లుగా రోడ్డు పనులు జరుగుతున్నా నేటికీ పూర్తికావడం లేదు. ఏటా వేసవిలో రాయి పిండివేసి వదిలేస్తున్నారు. వర్షాలు పడుతున్నప్పుడు కొట్టుకుపోయి.. మళ్లీ గోతులుగా మారుతున్నాయి. నిధులు ఖర్చు చేసినా పనులు పూర్తికాక కష్టాలు తప్పడం లేదు.

-పి.ఆనందరావు, కేరాశింగి

అనారోగ్యం వస్తే భయం..



మా కొండపై గ్రామాల్లో ఎవరైనా అనారోగ్యానికి గురైతే భయం వేస్తోంది. రోడ్డు పనులు జరిగితే ముందుగా వైద్య సేవలు అందుతాయని ఆశ పడుతున్నాం.

-సవర.లక్ష్మమ్మ, కేరాశింగి

పనులు చేపడతాం..

ఇటీవల బదిలీపై వచ్చాను. పూర్తిగా పనులు పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తాను. చేసిన పనులకు సంబంధించి బిల్లుల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. నిధులు వచ్చిన వెంటనే పనులు చేపడతాం.

-కేవీఎస్ఎన్ కుమార్, ఈఈ, సీతంపేట

ఆ యూరియా.. ఏమైంది?

(ఐదో పేజీ తరువాయి)

చేయకుండా అధికారులు తాత్సారం చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. నరసన్నపేట సొసైటీ పరిధిలో 34 పంచాయతీల్లో సుమారు 6వేలు మంది రైతులు ఉన్నారు. సొసైటీలో సుమారు 4వేల మంది రుణాలు తీసుకున్నారు. సొసైటీకి వచ్చిన యూరియా బస్తాలను వీరికి పంపిణీ చేయాలి. బస్తాకు రూ.270 చొప్పున విక్రయించాలి. కానీ పాలకవర్గం, సిబ్బంది బ్లాక్‌మార్కెట్‌కు తరలించారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. తమ బంధువుల పేరిట టోకెన్లు రాయించుకుని యూరియాను పక్కదారి పట్టించారనే ఆరోపణలు ఉన్నాయి. బయట మార్కెట్‌లో కూడా రూ.బస్తా రూ.500కు కొనుగోలు చేద్దామన్నా యూరియా దొరకడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి యూరియా పంపిణీ చేయాలని కోరుతున్నారు. కాగా సొసైటీ అధ్య క్షుడు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వకపోవడంతో యూరియా పంపిణీ చేయడం లేదని ఓ ఉద్యోగి తెలిపారు. ఈ విషయమై శనివారం సీఈవో ఈశ్వరరావు వద్ద 'ఆంధ్రజ్యోతి' ప్రస్తావించగా.. రెండు రోజుల కిందటే కొంతమంది రైతులకు టోకెన్లు పంపిణీ చేశామన్నారు. వర్షం కారణంగా యూరియా పంపిణీ చేయలేదన్నారు.



సంతబొమ్మాళిలో నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు

కూలిన విద్యుత్ స్తంభాలు

- తప్పిన పెను ప్రమాదం

సంతబొమ్మాళి, ఆగస్టు16(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం సంతబొమ్మాళి ఆర్అండ్‌బీ రోడ్డుకు ఆనుకొని ఉన్న విద్యుత్ స్తంభాలు శుక్రవారం రాత్రి నేలకొరిగాయి. ఈ రహదారి పక్కన కాలువల నిర్మాణానికి ఉపాధిహామీ పథకం నిధులు రూ.1.80 కోట్లు మంజూరయ్యాయి. ఈ పనులు సంబంధిత కాంట్రాక్టర్ చేపటాడు. కాలువ నిర్మాణానికి మధ్యలో 33కేవీ విద్యుత్ స్తంభాలు ఉన్నాయి. వాటిని పక్కకు మార్చాలని కాంట్రాక్టర్.. పంచాయతీరాజ్ ఇంజనీరింగ్, విద్యుత్‌శాఖ అధికారులను కోరాడు. స్తంభాల మార్పుకు డబ్బులు కట్టాలని విద్యుత్‌శాఖ అధికారులు చెప్పారు. ఇందుకు సదరు కాంట్రాక్టర్ అంగీకరించకుండా పనులు చేపట్టాడు. కాలువకు ఆనుకొని ఉన్న విద్యుత్ స్తంభాల వద్ద మట్టిని తీయడంతో వర్షాలకు ఎనిమిది స్తంభాలు నేలకొరిగాయి. ఆ సమయంలో విద్యుత్ సరఫరా లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. స్తంభాలు రోడ్డుకు అడ్డంగా పడిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. విద్యుత్ శాఖ అధికారులు శనివారం సాయంత్రానికి సరఫరాను పునరుద్ధరించారు.

వేడుకగా కృష్ణాష్టమి

- గోపిక, కృష్ణుల వేషధారణల్లో చిన్నారులు
- ఉట్టికొట్టేందుకు యువత పోటీ

శ్రీకృష్ణాష్టమి వేడుకలు శనివారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. ఉదయం రాధాకృష్ణ ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం స్వామివారి తిరువీధి కార్యక్రమం చేపట్టారు. మహిళలు సామూహిక పూజలు చేశారు. ఇళ్లల్లో చిన్నారులను కృష్ణుడు, గోపికలుగా అలంకరించారు. అనంతరం ఉట్టి సంబరాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఉట్టి కొట్టేందుకు యువత, చిన్నారులు పోటీపడ్డారు. ● హిరమండలం మండలంలోని కిట్టాలపాడు పంచాయతీ కూర్మ వైదిక గ్రామంలో శనివారం కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. వేల సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ప్రత్యేక పూజలు చేశారు. కూర్మ అభివృద్ధికి ఆయన రూ.50 వేలు విరాళాన్ని అందజేశారు. కూర్మలో రూ.10 కోట్లతో రాధాకృష్ణ మందిరం నిర్మించనున్నట్లు ఆశ్రమ నిర్వాహకులు త్రిబంగా నందదాస్ తెలిపారు.

-ఆంధ్రజ్యోతి బృందం



హిరమండలం: కూర్మలో కృష్ణాష్టమి వేడుకల్లో పాల్గొన్న భక్తులు



కోటబొమ్మాళి: శ్రీకృష్ణ, గోపికల వేషధారణలో చిన్నారులు



ఆమదాలవలస: మెట్టక్కివలసలో గోపూజ నిర్వహిస్తున్న భక్తులు



నరసన్నపేట: మరంవీధిలో చిన్నారుల సందడి



పలాస రూరల్: సత్యసాయి విద్యావిహార్‌లో..



కవిటిలో..



గార: బూరవెల్లిలో..



రణస్థలం:కృష్ణాష్టమి వేడుకల్లో ఎమ్మెల్యే ఎన్ఈఆర్ దంపతులు



హిరమండలం: కూర్మ గ్రామ అభివృద్ధికి రూ.50 వేలు విరాళం అందజేస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

చిరుద్యోగులపై కత్తి!

- ఉద్దానం ప్రాజెక్టు ఉద్యోగుల తొలగింపు
- 27 సంవత్సరాలుగా సేవలు
- కొద్దిరోజుల కిందటే మెగా కంపెనీలో విలీనం
- ఇంతలోనే 104 మందికి ఉద్వాసన
- ఆందోళనలో కార్మికులు

కాశీబుగ్గ, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ఉద్దానం మంచినీటి పథకం.. మూడు దశాబ్దాలుగా 8 మండలాలకు అపర భగీరథి. 300 గ్రామాల ప్రజల గొంతును తడుపుతోంది. ఈ మూడు దశాబ్దాలు తాగునీరు అందించడం వెనుక 150 మంది నిత్య శ్రామికుల కృషి ఉంది. కానీ, వారి జీతం తక్కువ. అదికూడా ఎప్పుడు ఇస్తారో తెలియని పరిస్థితి. ఇటీవల ఉద్దానం సమగ్ర మంచినీటి పథకం నిర్వహణలో భాగంగా మెగా కన్‌స్ట్రక్షన్‌లో ఉద్దానం ప్రాజెక్టును విలీనం చేశారు. ఇప్పటివరకూ పనిచేస్తున్న 132 మంది ఉద్యోగులు అందులో విలీనం అయ్యారు. కానీ, ఏ కారణం లేకుండా ప్రతి నెలా ఉద్యోగులను తొలగిస్తూ వచ్చింది మెగా కన్‌స్ట్రక్షన్ కంపెనీ. ఈ ఏడాది ఏప్రిల్‌లో 28 మందిని, ఈ నెల 13న మరో 76 మందిని తొలగించింది. దీంతో వారంతా ఆందోళనబాట పట్టారు. తిరిగి విధుల్లోకి తీసుకోకుంటే ఆత్మహత్యలే శరణ్యమని చెబుతున్నారు. ఈ విషయంలో జిల్లా మంత్రులతో పాటు ఎమ్మెల్యేలు కలుగజేసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

27 ఏళ్ల కిందట..

27 ఏళ్ల కిందట అప్పటి కేంద్ర మంత్రి కింజరాపు ఎర్రన్నాయుడు, అప్పటి ఎమ్మెల్యే గౌతు శివాజీ కృషి మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఉద్దానం మంచినీటి పథకాన్ని మంజూరు చేసింది. ముందుగా మహేంద్రతనయా, తరువాత బాహుదా నదుల్లో ఇన్‌ఫిల్టరేషన్ బావులు ఏర్పాటుచేసి శుద్ధి చేసిన నీటిని తరలించి ప్రజలకు అందించింది. ఇచ్ఛాపురం, కంచిలి, కవిటి, సోంపేట, మందస, పలాస, వజ్రపుకొత్తూరు, నందిగాం మండలాల్లో 290 గ్రామాలకుపైగా అప్పట్లో తాగునీరు అందించారు. అప్పట్లో 150 మంది కాంట్రాక్ట్ ఉద్యోగులు విధులు నిర్వహించేవారు.

ఉద్దానం సమగ్ర పథకంతో..

ఇచ్ఛాపురం, పలాస నియోజకవర్గాల్లోని కిడ్నీ వ్యాధిగ్రస్తులకు రక్షిత జలాలు అందించాలన్న ఉద్దేశంతో టీడీపీ ప్రభుత్వ హయాంలో 2018లో ఒక ప్రయత్నం జరిగింది. తరువాత అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం రూ.700 కోట్లతో ఉద్దానం సమగ్ర మంచినీటి పథకాన్ని ఏర్పాటు చేసింది. అయితే అప్పటి వరకూ ఉన్న ఉద్దానం మంచినీటి పథకాన్ని, అందులో పనిచేస్తున్న వారి విషయంలో ఎటువంటి స్పష్టతనివ్వలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఉద్దానం ప్రాజెక్టును, అందులో పనిచేస్తున్న ఉద్యోగులను మెగా కంపెనీలో విలీనం చేసింది. దీంతో ఉద్దానం ప్రాజెక్టుకు చెందిన 132 మంది మెగా కంపెనీలోకి బదలాయింపు జరిగింది. కానీ, ఇప్పుడు ఏకంగా 104మందిపై వేటు వేసింది ఆ కంపెనీ. మరికొంతమందిని కూడా తొలగించేందుకు సిద్ధపడుతుండడం ఆందోళన కలిగిస్తోంది. దీంతో ఉద్దానం ప్రాజెక్టు ఉద్యోగులు ఉద్యమ బాట పట్టారు.

ఎలా బతకాలి..



నా భర్త మరణిస్తే ఆయన ఉద్యోగం నాకు వచ్చింది. కొన్ని సంవత్సరాలుగా ఉద్దానం ప్రాజెక్టులో సేవలందిస్తున్నాను. వేతనం నెలకు రూ.12 వేలుగా ఉంది. పీఎఫ్, ఈఎస్ఐ కట్ అవుతుందని చెప్పారు. కానీ.. అందుకు సంబంధించి ధ్రువీకరణ కూడా లేదు. ఎప్పటికైనా గుర్తించకపోతారా? జీతం పెంచకపోతారా? అన్న కోణంలో పని చేశాం. కానీ, ఇప్పుడు ఉద్యోగం నుంచే తొలగించారు. నా పిల్లలతో నేను ఎలా బతకాలి. నాకు చావే శరణ్యం. కూటమి ప్రభుత్వం న్యాయం చేయాలి.

-సింధూర జయసుధ, సోంపేట

ప్రభుత్వమే ఆదుకోవాలి..



గత 20 ఏళ్లకుగా పైగా ఉద్దానం ప్రాజెక్టులోనే పనిచేస్తున్నాం. మరో ప్రత్యామ్నాయ ఉపాధి లేదు. ఎలా బతకాలో కూడా తెలియడం లేదు. అర్ధరాత్రి సమాచారం ఇచ్చారు. మిమ్మల్ని ఉద్యోగాల నుంచి తొలగిస్తున్నామని చెప్పారు. ఈ విషయంలో ప్రజాప్రతినిధులు స్పందించాలి. న్యాయం చేసి మా ఉద్యోగుల కుటుంబాలను ఆదుకోవాలి.

- కె.నీలాచలం,
జిల్లా ఉద్దానం ప్రాజెక్టు అధ్యక్షుడు



కాశీబుగ్గ గాంధీ విగ్రహం వద్ద ధర్నా చేస్తున్న ఉద్దానం ప్రాజెక్టు ఉద్యోగులు

కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలి

ఉద్దానం ప్రాజెక్టు నుంచి తొలగించిన 104 మంది ఉద్యోగులను వెంటనే విధులోకి తీసుకోవాలని ఆ ప్రాజెక్టు జిల్లా అధ్యక్షుడు కె.నీలాచలం, గౌరవ అధ్యక్షుడు సీహెచ్ వెంకటరమణ డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం కాశీబుగ్గ బస్టాండ్ ఆవరణలోని గాంధీ విగ్రహం వద్ద ఉద్దానం మంచినీటి సరఫరా ప్రాజెక్టు ఉద్యోగులు ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత 27 ఏళ్లుగా ఉద్దానం మంచినీటి ప్రాజెక్టులో కాంట్రాక్ట్ పద్ధతిలో పని చేస్తున్న తమను తొలగించడం అన్యాయమన్నారు. కలెక్టర్‌కు వినతి పత్రం అందజేసి తమ సమస్యలు విన్నవించుకున్నామన్నారు. జిల్లాలోని మంత్రులు, ఎమ్మెల్యేలను కలిసి తమ గోడు వినిపిస్తామన్నారు. తమకు తగు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని అన్నారు. ధర్నాలో ఉద్యోగులు జోగారావు, రాజా చంద్రశేఖర్, హేమ సుందర్, వైకుంఠరావు, కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

నిరుపయోగం

వమరవెల్లి ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణా సంస్థ (డైట్) నూతన భవన నిర్మాణం పూర్తయినా నేటికీ ప్రారంభానికి నోచుకోలేదు. ప్రస్తుతం ఉన్న భవనాలు వసతి, కార్యాలయాల నిర్వహణకు ఇబ్బందికరంగా ఉంది. ఎదురుగా పెద్ద విశాల భవనం కనిపిస్తున్నా వినియోగించకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా నూతన భవనాన్ని ప్రారంభించేందుకు సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని విద్యార్థులు కోరుతున్నారు.

-గార



ప్రారంభానికి నోచుకోని డైట్ నూతన భవనం

ప్రమాదకరం



రోడ్డుకు ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలు

మండలంలోని పలు మార్గాల్లో రోడ్లకు ఇరుపక్కలా పిచ్చి మొక్కలు పెరిగి ప్రమాదాలు జరుగుతున్నాయి. వాహనాలు ఎదురెదురుగా వచ్చే సమయంలో కనిపించకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాజాం, ఎర్రముక్కాం, గొల్లవూరు, రాణిగాం, జేసీ కొత్తూరు తదితర గ్రామాల సమీపంలో పిచ్చి మొక్కలు రోడ్లపైకే రావడంతో వాహనాలు తప్పించుకునే సమయంలో ముళ్ల పొద లు తగిలి గాయాలవుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పిచ్చి మొక్కలను తొలగించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

- సోంపేట రూరల్

స్వచ్ఛతేదీ?

మండల కేంద్రంలోని ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలు దారుణంగా ఉన్నాయి. వ్యవసాయ శాఖ, పశు వైద్య కేంద్రం, పీహెచ్‌సీ, గృహ నిర్మాణ శాఖ, మండల విద్యాశాఖ కార్యాలయాలతో నంది కొండ ప్రాథమిక పాఠశాల అదనపు భవనం చుట్టూ పిచ్చి మొక్కలు మొలిచాయి. ముళ్ల పొదలతో విష పురుగులు సంచరించడంతో పాటు దోమలు బెడద ఎక్కువగా ఉందని, తక్షణం కార్యాలయాల ఆవరణలను పరిశుభ్రం చేయాలని సిబ్బందితో పాటు పలువురు ప్రజలు కోరుతున్నారు.

-సరుబుజ్జిలి



హౌసింగ్ కార్యాలయం చుట్టూ పిచ్చిమొక్కలు

సెలవు రోజున తరగతుల నిర్వహణ

రణస్థలం, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): కృష్ణాష్టమి పర్వదినం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేటు, ప్రభుత్వ పాఠశాలలకు సెలవుగా ప్రకటించింది. అయితే కోష్ఠ గ్రామంలోని ఓ ప్రైవేటు పాఠశాల నిబంధనలను ఉల్లంఘించి శనివారం పాఠశాలను తెరిచి తరగతులను నిర్వహించింది. కృష్ణాష్టమి రోజును తరగతులు ఎలా నిర్వహిస్తారని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. సంబంధిత అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరించడంతో ప్రైవేటు స్కూల్ యాజమాన్యం ఇష్టాను సారంగా వ్యవహరిస్తోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. విషయం తెలుసుకున్న ఎంఈవో త్రినాధరావు పాఠశాలకు వెళ్లి సంబంధిత యాజమాన్యంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. యాజమాన్యంపై చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రణస్థలం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): రణస్థలం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఈఈ యోగేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ లైన్ల మరమ్మతుల నేపథ్యంలో జేఆర్‌పురం, జీఎంఆర్ కాలనీ, కొత్త పెట్రోల్ బంకు ప్రాంతాలలో 10 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి

పొందూరు, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పేడాడ సూరపు నాయుడు కోరారు. శనివారం పార్టీ నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 20న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ జిల్లా పర్యటనకు వస్తున్నందున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. రాయి రమణ, లోలుగు సింహాచలం పాల్గొన్నారు.

అలరించిన భక్తి గీతాలాపన

ఇచ్ఛాపురం, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): టి.బరంపురం దళిత వాడ దండాసి వీధిలో టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ కళాకారులు తిప్పన ధనుంజయరెడ్డి, వినోద్ కుమార్, లింగరాజు, వాసు ఉపమాపతి స్వామి భక్తి గీతాలను ఆలపించారు. కార్యక్రమంలో తులసీదాస్, రాంప్రసాద్, జయకృష్ణ, వెంకటరమణ, శ్రీను పాల్గొన్నారు.

సత్యసాయి శతజయంతి వేడుకలు ప్రారంభం

ఆమదాలవలస, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): సత్యసాయి బాబా శత జయంతి వేడుకలు శనివారం ప్రారంభమయ్యాయి. మెట్టక్కివలస సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో రవీంద్రబాబు, డాక్టర్ పి.తాతయ్యలు పాల్గొన్నారు.

'ఉపాధి' కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు

ఎచ్చెర్ల, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): ఏపీఎస్ఎస్‌డీసీ ఆధ్వర్యంలో ఎచ్చెర్ల ప్రభుత్వ ఐటీఐ స్కిల్ హబ్ సెంటర్‌లో ఉపాధి కోర్సుల్లో ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ ఎల్.సుధాకర రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అసిస్టెంట్ ఎలక్ట్రీషియన్, అసిస్టెంట్ మాన్యువల్ మెటల్ ఆర్క్ వెల్డింగ్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తామన్నారు. కనీసం పదో తరగతి విద్యార్హత కలిగి 18 నుంచి 30 ఏళ్ల లోపు యువకులు ఈ కోర్సులో చేరేందుకు అర్హులన్నారు. శిక్షణ పూర్తి చేసిన వారికి సర్టిఫికేట్‌తో పాటు ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 20లోగా సర్టిఫికేట్లు, ఆధార్, పాస్‌పోర్ట్ సైజు ఫొటోతో హాజరుకావాలన్నారు. ఇతర వివరాల కోసం 79891 77887 నెంబరులో సంప్రదించాలన్నారు.

ఎమ్మెల్యేపై ఆరోపణలు తగవు

ఆమదాలవలస, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ప్రజా మన్ననలను పొందుతున్న ఎమ్మెల్యే కూన రవికుమార్‌పై ఆరోపణలు చేస్తే సహించేది లేదని మునిసిపల్ మాజీ చైర్‌పర్సన్ తమ్మినేని గీత విద్యాసాగర్ హెచ్చరిం చారు. శనివారం ఆమె పీఏసీఎస్ అధ్యక్షురాలు శిమ్మ మాధవి, పట్టణ తెలుగుమహిళా నాయకులు ఎన్ని శ్రీదేవితో కలిసి విలేకరులతో మాట్లాడారు. లోలుగు కేజీబీవీ ప్రిన్సిపాల్‌గా ఆర్.సౌమ్య ఉన్న ఐదేళ్లలో విధుల్లో నిర్లక్ష్యంతో పాటు పిల్లలకు అందించాల్సిన పౌష్టికాహారం ఇవ్వకపోగా వాటిని ప్రశ్నించిన పలువురు తల్లిదండ్రులపై అట్రాసిటీ కేసులు బనాయించి వారిని భయభ్రాంతులకు గురిచేశార న్నారు. పట్టణ తెలుగు మహిళా అధ్యక్షురాలు బోయిన సునీత, మాజీ కౌన్సిలర్లు రెడ్డి గౌరి, గుడ్ల రాజ్యలక్ష్మి, రాష్ట్ర మాల కార్పొరేషన్ డైరెక్టర్ బోనెల అప్పా రావు తదితరులు పాల్గొన్నారు.

తప్పులు కప్పిపుచ్చుకునేందుకే..

పొందూరు, ఆగష్టు 16 (ఆంధ్రజ్యోతి): చేసిన తప్పులు విచారణలో బయటపడడంతో వాటిని కప్పిపుచ్చుకునేందుకే లోలుగు కేజీబీవీ ప్రిన్సిపాల్ సౌమ్య.. ఎమ్మెల్యే రవికుమార్‌పై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని టీడీపీ మండల మహిళా అధ్యక్షురాలు ఎ.విజయలక్ష్మి, ఎంపీటీసీ బాడాన హారిక, ఎంఎంఎస్ అధ్యక్షురాలు పైడి అరుణ అన్నారు. శనివారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. ఆమెపై వచ్చిన ఆరోపణలపై ఉన్నతాధికారులు విచారణ చేసి బదిలీ చేశారని, ఆ తరువాతే ఆమె ఎమ్మెల్యేను విమర్శిస్తున్నారని ఇవి తగవన్నారు..

స్ఫూర్తిప్రదాత వాజ్‌పేయి



వాజ్‌పేయి విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న దృశ్యం

సోంపేట, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): దేశాభివృద్ధిలో విశేషంగా కృషి చేసిన మాజీ ప్రధాని వాజ్‌పేయి స్ఫూర్తి ప్రదాత అని వక్తలు అన్నారు. వాజ్‌పేయి వర్ధంతి సందర్భంగా పట్టణంలోని ఆయన విగ్రహానికి బీజేపీ నేతలు పూలమాల వేసి నివాళి అర్పించారు. బీజేపీ నాయకులు బీన వంశీ, కొంచాడ రవిప్రసాద్, టి.విజయ్‌కుమార్ తదితరులు ఉన్నారు.

22 నుంచి బ్యూటీ పార్లర్ నిర్వహణకు శిక్షణ

ఎచ్చెర్ల, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్ల మండల కాంప్లెక్స్ రోడ్‌లోని యూనియన్ బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థలో మహిళలకు బ్యూటీ పార్లర్ నిర్వహణలో ఈనెల 22వ తేదీ నుంచి ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు సంస్థ డైరెక్టర్ ఎస్.రాంజీ ఒక ప్రకటనలో తెలిపారు. 35 రోజుల పాటు ఈ శిక్షణ ఇవ్వనున్నామని, ఈ కాలంలో ఉచిత భోజన, వసతి సౌకర్యం కల్పిస్తామన్నారు. 19 నుంచి 45 ఏళ్ల లోపు ఉన్న ఉమ్మడి జిల్లాకు చెందిన మహిళలు ఈ కోర్సులో చేరవచ్చన్నారు. మరింత సమాచారం కోసం 79933 40407, 95534 10809 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

'తెప్పల'కు బాలసాహిత్య పురస్కారం

పలాసరూరల్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): విశాఖ పౌర గ్రంథాలయంలో తెలుగు రాష్ట్రాల మాసపత్రిక బాలబాట వార్షికోత్సవం సందర్భంగా శనివారం జరిగిన కార్యక్రమంలో జనజాగృతి వ్యవస్థాపక అధ్యక్షుడు తెప్పల కృష్ణమూర్తికి బాల సాహిత్య పురస్కారం అందజేశారు. రచయిత, నటుడిగా 50 ఏళ్లుగా విశేష సేవలందిస్తున్నందున ఈ అవార్డుకు ఎంపిక చేసినట్టు పత్రిక సంపాదకురాలు వెంకట రమణమ్మ తెలిపారు. కార్యక్ర మంలో ఆంధ్రప్రదేశ్ సారస్వత పరిషత్ అధ్యక్షుడు గజల్ శ్రీనివాస్, పలువురు కళాకారులు పాల్గొన్నారు

ఆదిత్యుని సేవలో విజిలెన్స్ కమిషనర్



విజిలెన్స్ కమిషనర్ అనిల్‌చంద్ర పునేఠాకు జ్ఞాపికను అందిస్తున్న ఈవో కేఎస్‌వీడీవీ ప్రసాద్, ప్రధాన అర్చకుడు శంకరశర్మ

అరసవల్లి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ప్రత్యక్ష దైవం, ఆరోగ్యప్రదాత అరసవల్లి సూర్యనారా యణ స్వామి వారిని రాష్ట్ర విజిలెన్స్ కమిషనర్, పూర్వపు చీఫ్ సెక్రటరీ అనిల్‌చంద్ర పునేఠా శనివారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనకు ఆలయ ప్రధాన అర్చకుడు ఇప్పిలి శంకరశర్మ స్వాగతం పలుకగా, అర్చకులు వేద మంత్రాలతో ఆశీర్వదించారు. స్వామి వారి చిత్ర పటం, ప్రసాదాన్ని ఈవో కేఎస్‌వీడీవీ ప్రసాద్ అందజేశారు. ● రాష్ట్ర విజిలెన్స్ కమిషనర్ పునేఠాను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి, జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, అసిస్టెంట్ కలెక్టర్ పృథ్వీరాజ్‌కుమార్, ఆర్డీవో కె.సాయి ప్రత్యూష, ఎమ్మెల్యే గొండు శంకర్ మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఈయన గతంలో ఇక్కడ కలెక్టర్‌గా పనిచేశారు. భూ పరిపాలన శాఖ ముఖ్య కమిషనర్‌గా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పనిచేసి పదవీ విరమణ అనంతరం 2024 అక్టోబరులో విజిలెన్స్ కమిషనర్‌గా నియమితులయ్యారు. స్థానిక కలెక్టర్ బంగ్లా వద్ద ఆంజనేయస్వామిని పునేఠా దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

ఊపందుకున్న వరినాట్లు



బెల్లుపడలో వరి నాట్లు వేసిన పొలాలు

ఇచ్ఛాపురం, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): ఇటీవల కురుస్తున్న వర్షాలకు వరినాట్లు ఊపందుకున్నాయి. రైతులు విస్తారంగా వరి పంటను సాగు చేస్తున్నారు. మండలంలో 7734 ఎకరాలకుగాను ఇప్పటి వరకు 2433 ఎకరాల్లో వరినాట్లు పూర్తి కాగా మరో 300 ఎకరాల్లో దమ్ములు అవుతున్నాయని వ్యవసాయ శాఖాధికారి అజయ్‌కుమార్ తెలిపారు. రత్తకన్న, తేలుకుంచి, బెల్లుపడ డొంకూరు, లొద్దపుట్టి, కేదారిపురం, తులసిగాం, ధర్మపురం, ముచ్చింద్ర గ్రామాల్లో వరి నాట్లు పూర్తయ్యాయన్నారు. మరో రెండు, మూడు రోజులు విస్తారంగా వర్షాలు పడితే మిగిలిన వరి నాట్లు పూర్తయిపోతాయని తెలిపారు.

మాదక ద్రవ్యాల బారిన పడొద్దు



మానవహారం నిర్వహిస్తున్న దృశ్యం

ఆమదాలవలస, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): యువత డ్రగ్స్ బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని కోరుతూ పోలీసు శాఖ ఆధ్వర్యంలో శనివారం రైల్వేస్టేషన్ జంక్షన్ నుంచి వన్‌వే జంక్షన్ గాంధీ విగ్రహం వరకు ర్యాలీ, అనంతరం మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా విజిలెన్స్, మోనటరింగ్ కమిటీ సభ్యుడు తాళాబత్తుల ధనుంజయరావు మాట్లాడుతూ.. పుట్టినరోజులు, విందు, వినోదం పేరుతో యువత గంజాయి వంటి మత్తు పదార్థాలకు బానిసలవుతుండడం ఆందోళన కలిగిస్తోందన్నారు. దీనివల్ల వారి భవిష్యత్ నాశనమవుతుందన్నారు. ఏఎస్ఐ గోపాలకృష్ణ మాట్లాడుతూ.. టెక్నాలజీ కారణంగా కొన్ని గంజాయి బ్యాచ్‌లు పోలీసులకు పట్టుబడకుండా తిరుగు తున్నప్పటికీ వారిపై నిఘా కొనసాగుతుందన్నారు.

న్యూస్ బాక్స్

మాజీ ఎంపీపీ దాలయ్య మృతి



దాలయ్య (ఫైల్)

ఇచ్ఛాపురం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీపీ పరపటి దాలయ్య (80) అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. పార్టీ కోసం దాలయ్య ఎనలేని సేవలు అందించారని పలువురు టీడీపీ నేతలు అన్నారు. దాలయ్య అంత్యక్రియల్లో టీడీపీ మండల అధ్యక్ష, కార్యదర్శులు లోపింటి పద్మనాభం, దక్కత కామేష్, పీఏసీఎస్ అధ్యక్షుడు పెదిని బాబ్జీ, దక్కత శ్రీను పాల్గొన్నారు.

ఆమె నేత్రాలు సజీవం



మండా సీతాలక్ష్మి (ఫైల్‌ఫొటో)

అరసవల్లి, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం నగరం అరసవల్లికి చెందిన రిటైర్డ్ తెలుగు పండిట్ మండా సీతాలక్ష్మి (76) శనివారం మృతి చెందారు. ఆమె నేత్రాలను దానం చేసేందుకు కుటుంబ సభ్యులు నిర్ణయించుకుని రెడ్‌క్రాస్ ప్రతినిధులకు తెలియజేశారు. మగటపల్లి కల్యాణ్ నేత్ర సేకరణ కేంద్రం టెక్నీషియన్లు పి.సుజాత, చిన్నికృష్ణ కార్నియాలను సేకరించి విశాఖపట్నం ఎల్‌వీ ప్రసాద్ నేత్ర సేకరణ కేంద్రానికి తరలించారు.

సుజలధార నీరు వృథా..!



ట్యాంకు వద్ద పైప్‌లైన్ లీకై బయటకు వస్తున్న నీరు

కవిటి, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): కవిటి తహసీల్దార్ కార్యాలయం వద్ద ఉన్న సుజలధార తాగునీటి ట్యాంకుకు వెళ్లే పైప్‌లైన్ లీకవడంతో నీరంతా వృథా అవుతోంది. గత కొన్ని రోజులుగా ఇదే పరిస్థితి ఉన్నా సంబంధిత అధికారులు స్పందించడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో తాగునీరు రోడ్డుపై ప్రవహిస్తుండడంతో గ్రామాలకు సక్రమంగా చేరకపోవడంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నీటి వృథాను అరికట్టే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పాత పెన్షన్ కోసం 25న మహా ధర్నా

పాత శ్రీకాకుళం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ మెమో 57 ప్రకారం డీఎస్సీ 2003 ఉపాధ్యాయులకు పాత పెన్షన్ మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్రస్థాయి మహాధర్నాను ఈనెల 25న విజయవాడలో నిర్వహించనున్నట్లు ఫోరం నేతలు తెలిపారు. శ్రీకాకుళం ఎన్జీవో హోంలో జిల్లా కన్వీనర్ కొత్తకోట శ్రీహరి ఆధ్వర్యంలో పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల నియామక ప్రక్రియ 2004వ సెప్టెంబరు 1వ తేదీకి ముందే పూర్తయినా ప్రభుత్వం అలస్యంతో అన్యాయం జరిగిందన్నారు. ఈ సమస్యపై ఐదేళ్లుగా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఉద్యమం తప్పనిసరైందన్నారు. రాష్ట్ర కన్వీనర్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. దాదాపు 16 రాష్ట్రాలు ఈ మెమోను అమలు చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం విస్మరిస్తోందన్నారు. ఈనెల 25న విజయవాడలో నిర్వహిస్తున్న మహా ధర్నాలో అందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఫోరం ప్రతినిధులు దుప్పల శివరాం ప్రసాద్, ఎస్వీ రమణ, దానేటి కేశవరావు, కూన రంగనాయకులు, పూజారి హరిప్రసన్న, సూర పాపారావు, కరిమి రాజేశ్వరరావు, గురుగుబెల్లి భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ మండల అనుబంధ కమిటీల ఎన్నిక

ఇచ్ఛాపురం, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): టీడీపీ మండల అనుబంధ కమిటీల ఎన్నికను శనివారం నిర్వహించారు. స్వేచ్ఛా వతి అమ్మవారి ఆలయంలో ఎమ్మెల్యే బెందాళం అశోక్ ఆదేశాల మేరకు పార్టీ మండల కమిటీ ఆధ్వర్యంలో ఈ ఎన్నికలు చేపట్టారు. తెలుగు యువత మండ ల అధ్యక్షుడిగా బోర యువరాజు, తెలుగు మహిళా అధ్యక్షురాలిగా కూన అన్నపూర్ణ, తెలుగు రైతు అధ్యక్షుడిగా పిట్ట దివాకర్, బీసీసెల్ అధ్యక్షుడిగా కోట రామారావులను ఎన్నుకున్నారు. ఐటీడీపీ అధ్యక్షుడిగా కంద్రేడ్ల నరేంద్రరెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా నల్ల శ్రీను, మైనార్టీ సెల్ అధ్యక్షుడిగా శ్రీకాంత్ మహంతి, కళాకారుల విభాగం అధ్యక్షుడిగా తరిణి బెహరాలతో పాటు ఉపాధ్యక్షులు, కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ దక్కత డిల్లీరావు, పార్టీ మండల అధ్యక్ష, కార్యదర్శులు లోపింటి పద్మనాభం, దక్కత కామేష్ పాల్గొన్నారు.

జేసీఐ ఆధ్వర్యంలో సైలెంట్ స్టార్స్‌కు సత్కారం

ఇచ్ఛాపురం, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): పోలీసు శాఖలో విశేష సేవలు అందిస్తున్న వారిని గుర్తించి జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ (జేసీఐ) ఆధ్వర్యంలో సత్కరించారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్య క్షుడు, టీడీపీ నియోజకవర్గ తెలుగుయువత అధ్యక్షుడు కాళ్ల జయదేవ్ మాట్లాడుతూ.. విధుల్లో ఉన్న ప్రతీ పోలీస్ అధికారి సైలెంట్ స్టార్ అని అన్నారు. పట్టణ ఎస్ఐ ముకుందరావు మాట్లాడుతూ పోలీసులను నిజమైన సైలెంట్ స్టార్స్‌గా గుర్తించి సత్కరించడం ఆనందంగా ఉందన్నారు. జేసీఐ ప్రతినిధులు ఈశ్వర్, కార్యదర్శి డాక్టర్ మోహన్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వ్యక్తి మృతి


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

వజ్రపుకొత్తూరు, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): పూండి రైల్వే స్టేషన్ వద్ద శనివారం సాయంత్రం గూడ్స్ రైలు ఢీకొన్న ఘటనలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందినట్టు పలాస జీఆర్‌పీ ఎస్‌ఐ ఎ.కోటేశ్వరరావు తెలిపారు. మృతుడి వయస్సు 30 ఏళ్లు ఉండొచ్చని, పింక్ కలర్ టీషర్టు, సిమెంట్ కలర్ షాట్ ధరించారని చెప్పారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి పోస్టుమర్టం నిమిత్తం పలాస ప్రభుత్వాసుపత్రికి తరలించామన్నారు. మృతుడి వివరాలు తెలిసివారు 94406 27567 ఫోన్ నెంబరులో సంప్రదించాలని జీఆర్‌పీ ఎస్‌ఐ కోరారు.

నానో చిప్‌ల తయారీకి సెంచూరియన్ విద్యార్థులు సిద్ధం


స్టాల్‌ను ప్రారంభిస్తున్న డీఎన్ రావు

నెల్లిమర్ల, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది భారత్ తొలిసారిగా స్వదేశీ పరిజ్ఞానంతో సెమి కండక్టర్ తొలి చిప్‌ను తయారు చేయనుండగా, సెంచూరియన్ విద్యార్థులు కూడా ఈ ఏడాది తొలిసారిగా చిప్‌ను తయారు చేయనున్నారని విశ్వవిద్యాలయం ఉపా ధ్యక్షుడు ప్రొఫెసర్ డీఎన్ రావు వెల్లడించారు. శనివారం ఆయన విశ్వవిద్యాల యంలో స్టాల్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వచ్చే ఏడాది నాటికి సెంచూరియన్ విద్యార్థులు ఏడు రకాల చిప్‌లను తయారు చేయ డానికి కృషి చేస్తున్నారని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడి సతీమణి పద్మ, వైస్ చాన్సలర్ ప్రశంత్‌కుమార్ మహంతి, రిజిస్ట్రార్ డాక్టర్ పల్లవి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు రూ.40వేలు వితరణ


చెక్కు అందిస్తున్న సర్పంచ్ నూక శైలజ సత్యరాజు

కోటబొమ్మాళి, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): పొడుగుపాడు ప్రాథమిక పాఠశాలకు శ్రీజగన్నాథపురం సర్పంచ్ నూక శైలజ సత్యరాజు శనివారం రూ.40వేల చెక్కును వితరణగా అందజేశారు. ఈ మొత్తాన్ని పిల్లల చదువుకోసం వినియోగించాలని హెచ్‌ఎంను కోరారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు ఎండ భాస్కరరావు, సింగూరు కల్యాణి, అన్నెపు భాస్కరరావు, ఎండ నారాయణ, తిర్లంగి చిన్నప్పుడు, గుంట సోమేశ్వరరావు, వెనకంటి సూజత తదితరులు పాల్గొన్నారు.

కనీస వేతనాలు అమలు చేయాలి


నిరసన తెలుపుతున్న ఎండీఎం కార్మికులు

నరసన్నపేట, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన వంట కార్మికులకు, శానిటేషన్ కార్మికులకు గౌరవ వేతనం రూ.20 వేలు అమలు చేయాలని ఎండీఎం కార్మికుల సంఘ జిల్లా గౌరవ అధ్యక్షుడు అల్లు మహాలక్ష్మి, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు ఆర్.సురేష్‌బాబు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ఎమ్మార్సీ భవనం వద్ద ధర్నా నిర్వహించారు. కార్మికులకు కనీస వేతనాలు ఇవ్వాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని, శ్రమకు తగిన వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. మండల కమిటీ సభ్యులు ఎ.రాధ, ఆర్.కాంతమ్మ, నాగమణి రత్నం, సూరమ్మ, విజయకుమారి, సరస్వతి, సుమలత, సంతోషి కుమారి, జ్యోతి, నవీనా, దేవి, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

ఇరుకు గదిలోనే..

- సొంత భవనానికి నోచుకోని ఐసీడీఎస్ కార్యాలయం
- ఇబ్బందిపడుతున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది


జీవనోపాధుల వనరుల కేంద్రంలో నిర్వహిస్తున్న ఐసీడీఎస్ కార్యాలయం

కొత్తూరు, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): కొత్తూరు ఐసీడీఎస్ కార్యాలయం గత పదేళ్లగా సొంత భవనం లేక, పరాయి పంచన కొనసాగుతోంది. దీంతో పూర్తిస్థాయిలో వసతి లేక ఇటు సిబ్బంది, అటు అంగన్‌వాడీ కార్యకర్తలు ఇబ్బంది పడుతున్నారు. మండల కేంద్రానికి సుమారు రెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న జీవనోపాధుల వనరుల కేంద్రంలో ఓ గదిలో కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు. సిబ్బంది వరండాలో విధులు నిర్వహిస్తుండగా, రికార్డులు భద్రపరిచే గదిలో పీవో తమ విధులు నిర్వహిస్తున్నారు. 1992లో ఐసీడీఎస్ ప్రాజెక్టు ప్రారంభమైన రెండేళ్లలోనే బాలికల వసతి గృహం వెనుకన కొత్తగా భవనం నిర్మాణం చేశారు. అది శిథిలావస్థకు చేరడంతో విడిచి పెట్టి కొన్నాళ్లు ఏకలవ్య పాఠశాల భవనంలోను, ఆ తర్వాత జీవనోపాధుల భవనంలోకి మార్పు చేశారు. మండల కేంద్రానికి దూరంగా ఉండడంతో ఎప్పుడు ఎవరు వస్తున్నారో తెలియని పరిస్థితి. ఈ ప్రాజెక్టు పరిధిలో ఉన్న కొత్తూరు, హిరమండలం, ఎల్ఎన్ పేట మండలాలకు సంబంధించి సమావేశాల నిర్వహించేటప్పుడు అంగన్‌వాడీ కార్యకర్తలు, వివిధ పనులపై కార్యాలయాలనికి వచ్చేవారు రెండు కిలోమీటర్లు నడవాలి. మండల కేంద్రంలో కనీసం అద్దె భవనంలోనైనా కొనసాగించాలని వారంతా కోరుతున్నారు. కొత్త భవన నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాలని ఆదేశాలు అందడంతో పాత రెవెన్యూ కార్యాలయం పరిధిలోని సుమారు 10 సెంట్లు స్థలాన్ని మంజూరు చేసినట్టు తెలుస్తుంది. కొత్త భవనం పనులు పూర్తయితే అన్ని సమస్యలు తొలగిపో తయాని అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది చెబుతున్నారు.

ప్రారంభించి వదిలేశారు..


వృథాగా పడివున్న యలమంచిలి రైతు సేవా కేంద్రం

జలుమూరు, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): యలమంచిలి గ్రామ సచివాలయం పరిధిలో నిర్మించిన రైతు సేవా కేంద్రం ప్రారంభించి వదిలేశారు. రైతులకు అందుబాటులో ఉండి ఎరువులు, వ్యవసాయ పనిముట్లు, పురుగుమందులు, విత్తనాలు అందించడానికి రూ.24 లక్షలు వెచ్చించి ప్రభుత్వం నిర్మించింది. దీనిని గతేడాది అట్టహాసంగా ప్రారంభించినా నేటికీ వినియోగించడం లేదు. ప్రస్తుతం ఖరీఫ్ వ్యవసాయానికి ఎరువులు, విత్తనాలు గ్రామ సచివాలయానికి వస్తున్నప్పటికీ అవి నిలువ ఉంచడానికి గోదాములు లేక అవస్థలు పడుతున్నారు. దీనిపై వ్యవసాయాధికారి రవికుమార్ మాట్లాడుతూ.. త్వరలోనే వినియోగంలోకి తీసుకువస్తామని చెప్పారు.


కేదారిపురంలో రైతుసేవా కేంద్రం

ఇంకెప్పుడు ప్రారంభిస్తారో?

పలాస రూరల్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): పలాస మండలంలోని పలు పంచాయతీల్లో నిర్మించిన రైతుసేవా కేంద్రాలు, విలేజ్ క్లినిక్ భవనాలు ప్రారంభోత్సవం కోసం ఎదురు చూస్తున్నాయి. రెంటికోట గ్రామంలో రైతుభరోసా కేంద్రంతో విలేజ్ క్లినిక్, కేదారిపురం పంచాయతీలో విలేజ్ క్లీనిక్, రైతు సేవా కేంద్రాలు సిద్ధమైనా ప్రారంభోత్సవానికి నోచుకోలేదు. తర్లాకోట గ్రామంలో రైతుభరోసా కేంద్రం ప్రారంభమైనా విద్యుత్ సరఫరాలేదు, విలేజ్ క్లీనిక్‌ను ప్రారంభించాల్సి ఉంది. దీంతో వీటి చుట్టూ చెత్త, పిచ్చి మొక్కలతో నిండిపోతున్నాయి. కొన్నిచోట్ల అసాంఘిక కార్యకలాపాలకు వినియోగిస్తున్నారు. సరైన రక్షణ లేకపోవడంతో ఆ ప్రాంతమంతా చెత్తకుప్పలుగా మారుతుంది. ఎంతో ఉన్నతాశయంతో ప్రజాపాలనను మెరుగుపర్చేందుకు ఏర్పాట్లు చేసినా వీటిని ఇంకా ప్రారంభించకపోవడంపై విమర్శలు వినిపిస్తున్నాయి.


ప్రారంభోత్సవం కోసం ఎదురుచూస్తున్న విలేజ్ క్లీనిక్

సేంద్రియ ఎరువులతోనే భూసారం పెంపు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

జలుమూరు, (సారవకోట), ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): సేంద్రియ ఎరువుల వాడకం వల్ల భూసారం పెంచడంతో పాటు అధిక దిగుబడులు సాధించవచ్చని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ భవనంలో శనివారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రసాయనిక ఎరువులు విరివిగా వాడడం వలన భూసారం తగ్గి దిగుబడులు తగ్గుతున్నాయన్నారు. ముందుగా సర్దార్ గౌతు లచ్చన్న చిత్రపటానికి పూలమాలలు వేసి ఎమ్మెల్యే నివాళులర్పించారు. ఎంపీపీ చిన్నాల కూర్మినాయుడు, మండల ప్రత్యేకాధికారి మంద లోకనాథం, ఎంపీడీవో మోహన కుమార్, పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సామగ్రి అందజేత

పలాస, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీరామకృష్ణ సేవా సంఘం ఆధ్వర్యంలో శనివారం స్థానిక మోడల్ పాఠశాల విద్యార్థులకు పలకలు, రాత సామగ్రి అందించారు. అదేవిధంగా ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. సేవా కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు, రోగులకు తాము వీటిని పంపిణీ చేస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సంఘ ఉపాధ్యక్షుడు ఉప్పాడ పాండురంగారావు, వాసుదేవరావు, కార్యదర్శి గోరు శ్రీనివాసుబాబు, మంగపతి, గోపి పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామికి పూజలు

నందిగాం, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): పెంటూరులో కొలువై ఉన్న వేంకటేశ్వరస్వామి శ్రీకృష్ణ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ధర్మకర్తలు బొడ్డ జనార్దనరావు, నారాయణరావు, కృష్ణారావు ఆధ్వర్యంలో అర్చకులు పి.వరహానర్సింహాచార్యులు, రాజగోపాలాచార్యులు పర్యవేక్షణలో స్వామివారికి శ్రీకృష్ణ అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. దీంతో భక్తి పరవశం నెలకొంది. ఈ సందర్భంగా భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

జనావాసాల్లోకి వానరాలు

- ఆందోళనలో ప్రజలు


సిరిపురం ప్రాంతంలో..

హరిపురం, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): మందస మండలంలో డబారు, పుచ్చపాడు, జీఆర్ పురం, పొత్తంగి, సిరిపురం, బెల్లుపటియా వంటి పలు గ్రామాల్లో వానరాలతో ప్రజలు భయం భయంతో గడుపుతున్నారు. ఆయా గ్రామాల్లో వానరాల దాడుల్లో పదుల సంఖ్యలో గాయపడిన సందర్భాలు కోకొల్లాలు. మామిడి, జీడి పంటల సమయంలో వీటితో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరి పంట పొలాలను సైతం ధ్వంసం చేస్తున్నాయని వాపోతున్నారు. అటవీ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన లేదనివాపోయారు. ఈ సమస్యపై ప్రజాప్రతినిధులు స్పందించి ఆదుకోవాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

కిడ్నీ వ్యాధిగ్రస్థుల మృత్యుఘోష పట్టదా?


మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి గోవిందరావు

కాశీబుగ్గ, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): ఉద్దానంలో కిడ్నీ వ్యాధిగ్రస్థుల మృత్యుఘోష ప్రభుత్వానికి పట్టకపోవడం దురదృష్టకరమని సీపీఎం జిల్లా కార్యదర్శి గోవిందరావు, కార్యవర్గ సభ్యులు కోనారి మోహన్‌రావు అన్నారు. శనివారం కాశీబుగ్గలోని పార్టీ కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడారు. ఉద్దానం కిడ్నీ వ్యాధులకు కారాణాలు పరిశీలించేందుకు అంతర్జాతీయ నిపుణులతో కూడిన బృందాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఖాళీగా ఉన్న 40 వైద్యుల పోస్టులను భర్తీ చేయాలన్నారు. ఉద్దానం గ్రామాలకు సురక్షిత మైన తాగునీరు అందిం చాలన్నారు. డయాలసిస్ వ్యాధిగ్రస్థులకు ఉచిత అంబులెన్స్ సౌకర్యం కల్పిం చాలని, పింఛన్ అందించాలని డిమాండ్ చేశారు. కిడ్నీ వ్యాధిపై గ్రామాల్లో అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలన్నారు. అక్కుపల్లితో సహా అన్ని పీహెచ్‌సీల్లో డయాలిసిస్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

శ్రీముఖలింగంలో గో పూజ

జలుమూరు, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): శ్రీముఖలింగంలో వెలసిన రాధా గోవిందస్వామి ఆలయంలో అర్చకులు గోపూజ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణాష్టమి పర్వదినం పురస్కరించుకొని శనివారం ఉదయం ఆలయ ప్రాంగణంలో గోవును అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. గోవును నూతన వస్త్రాలతో అలంకరించి మంగళ హారతులు ఇచ్చి పూజలు చేశారు. ఈ సందర్భంగా అర్చకులు వెంకటాచలం మాట్లాడుతూ.. గోమాతను ఎక్కడ పూజిస్తారో అక్కడ లక్ష్మీదేవి విలసిల్లుతుందన్నారు. కార్యక్రమంలో అర్చకులు నవీన్ దాస్, ప్రసాద్ పాడి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తర్ర బలరాం, సర్పంచ్ టి.సతీష్‌కుమార్, ఎంపీటీసీ కె.హరిప్రసాద్, న్యాయవాది చింతాడ వెంకటరమణ, దేవదాయశాఖ సిబ్బంది, పలువురు అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

- సంతబొమ్మాళి, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): కృష్ణాష్టమి సందర్భంగా శనివారం గొదలాం, కారిపేట గ్రామాల్లో గోవులకు పూజలు నిర్వహించారు. కారిపేటలో నిరంజన్ స్వామిజీ అధ్వరంలో హోమం నిర్వహించారు. కార్యక్రమంలో పెద్దఎత్తున్న భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో పిలక ధనుంజయకుమార్ తదితరులు పాల్గొన్నారు.


జలుమూరు: గోవుకు పూజలు చేస్తున్న దృశ్యం


సంతబొమ్మాళి: గొదలాంలో గోపూజ..

పాఠశాలకు ప్రింటర్ అందజేత

వజ్రపుకొత్తూరు, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): హంకుంపేట ప్రాథమిక పాఠశాలకు గ్రామానికి చెందిన మూగి వేణు ప్రింటర్ అందించినట్టు హెచ్‌ఎం ఎం.మోహనరావు చెప్పారు. పాఠశాలకు ఎంతో ఉపయోగమైన పింటర్‌ను అందించడంపై ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్మన్ సింహాచలం, ఉపాధ్యాయులు సత్యనారాయణ, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

షాపు తీయకపోయినా రూ.7,247 విద్యుత్ బిల్లు


రూ. 7వేలు పైబడి వచ్చిన బిల్లును మొబైల్‌లో చూపిస్తున్న దృశ్యం

టెక్కలి, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): టెక్కలి పాత జాతీయ రహదారిపై అద్దెకు నిర్వహిస్తున్న వాటర్ సర్వీసింగ్ సెంటర్ రెండు నెలలుగా మూసివుంచినా ఏడు వేల రూపాయలు విద్యుత్ బిల్లు రావడంతో షాపు యజమాని కె.తేజ షాక్‌కు గురయ్యాడు. వాటర్ సర్వీసింగ్ సెంటర్ నడుపుకుంటూ కుటుంబ జీవనం సాగిస్తున్నాడు. అయితే ఈయన రెండు నెలల క్రితం పనిచేస్తుండగా ప్రమాదవశాత్తు పడిపోవడంతో కుడిచేయి విరిగిపోయింది. అప్పటి నుంచి షాపు తీయడం లేదు. అయినప్పటికీ రూ.7,247 బిల్లు రావడంతో ఆవేదన వ్యక్తం చేశాడు. విషయాన్ని సంబంధిత అధికారులకు తెలియజేసినా పట్టించుకోవడం లేదని తేజ వాపోయాడు.

ఆర్ఐగా రమణమ్మ


ఆర్ఐ రమణమ్మ

పాతపట్నం ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): పాతపట్నం ఆర్ఐగా బొంతు రమణమ్మ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఈమె పలాస మండల ఎలక్షన్ సీనియర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. అప్పటికే ఐఆర్ఐగా విధులు నిర్వహించిన బాబీ పండిత్ సీనియర్ అసిస్టెంట్‌గా స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో బాధ్యతలు స్వీరించారు.

18న దివ్యాంగులు హాజరు కావాలి

టెక్కలి, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): సదరం సర్టిఫికెట్లు రీవెరిఫికేషన్‌లో రద్దయిన దివ్యాంగులు ఈనెల 18న టెక్కలి సబ్‌కలెక్టర్ కార్యాలయానికి హాజరు కావాలని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా అధ్యక్షుడు ఆవుల వేణుగోపాల్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఆ రోజు సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద సదరం సర్టిఫికెట్ రద్దుకాబడిన వారు ఆధార్ కార్డు జెరాక్స్‌లతో హాజరవ్వాలని కోరారు.

జీడి కార్మికుల వితరణ


నిర్వాహకులకు చెక్కు అందిస్తున్న దృశ్యం

పలాస, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): గోవుల దాణాకోసం స్థానిక పారిశ్రామికవాడ జీడి కార్మికులు తాము దాచుకున్న నగదు రూ.54 వేలు శనివారం వితరణగా అందజేశారు. రామకృష్ణాపురం వద్ద సత్యసాయి విద్యా విహార్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గోశాలకు నగదు వితరణ ఇచ్చారు. ఈ సందర్భంగా పారిశ్రామికవాడ ఉపాధ్యక్షుడు తాళాసు శ్రీనివాసరావు పరిశ్రమలో పని చేస్తున్న మహిళా కార్మికులు వారి వేతనంలో కొంత నగదు ప్రతినెలా పొదుపు చేసుకున్నారు. అనంతరం గోవుల దాణాకు వాటిని వినియోగించాలని యజమానికి చెప్పడంతో చెక్కు రూపంలో సత్యసాయి విద్యా విహార్ నిర్వాహకులు మల్లా రామేశ్వరరావుకు అందించి ఉదారత చాటుకున్నారు. ఈ సందర్భంగా నిర్వాహకులు కార్మికులకు అభినందించారు.

ఘనంగా గౌతు లచ్చన్న జయంతి

సోంపేట, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): గౌతు లచ్చన్న జయంతి పట్టణంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ ఆధ్వర్యంలో లచ్చన్న ఘాట్‌లో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. గౌతు శివాజీ దంపతులు లచ్చన్న విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమాల్లో తహసీల్దార్ అప్పలస్వామి, నాయకులు సూరాడ చంద్రమోహన్, మద్దిల నాగేశ్వరరావు, చిత్రాడ శేఖర్, బీన ఈశ్వరరావు, బెందాళం బాబూరావు, గోవిందరెడ్డి తదితరులు ఉన్నారు. శ్రీశయన చైతన్య దీపిక ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వైద్యులు ఎస్.రాజేంద్రప్రసాద్, లక్ష్మీనారాయణ, చైతన్య దీపిక అధ్యక్షుడు దేవాడ మోహనరావు తదితరులు ఉన్నారు.


సోంపేట: లచ్చన్న విగ్రహానికి నివాళులర్పిస్తున్న విప్ అశోక్

జిల్లా పోలీసు కార్యాలయంలో..


శ్రీకాకుళం క్రైం: లచ్చన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఏఎస్పీ శ్రీనివాసరావు

శ్రీకాకుళం క్రైం, ఆగస్టు 16 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు, సర్దార్ గౌతు లచ్చన్న జయంతి శనివారం జిల్లా పోలీసు కార్యాలయం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ పి.శ్రీనివాసరావు పూలమాలలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ.. లచ్చన్న రైతుల కోసం అలుపెరుగని పోరాటం చేశారని కొనియాడారు. కార్యక్రమంలో డీఎస్పీ శేషాద్రి, సీఐ శ్రీనివాసరావు, ఆర్ఐలు నరసింగరావు, శంకర్ ప్రసాద్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గాంధీ మందిరంలో..

శ్రీకాకుళం కల్చరల్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): నగరంలోని గాంధీ మందిరంలోని సంఘ సంస్కర్తల స్మృతివనంలో శనివారం ఘనంగా గౌతు లచ్చన్న జయంతి నిర్వహించారు. రాజాం మునిసిపల్ అధికారి జి.ప్రసాదరావు, ప్రొఫెసర్ విష్ణుమూర్తి, జామి భీమశంకర్, కొంక్యాన వేణుగోపాల్, లచ్చన్న విగ్రహదాత వంగా మహేష్‌దేవ్ తదితరులు పాల్గొని నివాళులర్పించారు. కార్యక్రమంలో గాంధీ మందిర ప్రతినిధులు నక్క శంకరరావు, జి.నాగేశ్వరరావు, పెంకి చైతన్యకుమార్, ఎంవీఎస్ శాస్త్రి, సువ్వారి రాజారావు తదితరులు పాల్గొన్నారు.

పలాసలో..

పలాస, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): సామాన్య కుటుంబంలో పుట్టి స్వాతంత్ర్య పోరాటంలో బ్రిటిష్‌వారిని ఎదురొడ్డిన గొప్పవ్యక్తి సర్దార్ గౌతు లచ్చన్న అని పలువురు వక్తలు కొనియాడారు. గౌతు లచ్చన్న జయంతి సందర్భంగా కేటీ రోడ్డు నెలకొల్పిన గౌతు లచ్చన్న విగ్రహానికి స్థానిక టీడీపీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు, రొట్టెలు పంచిపెట్టగా, కాశీబుగ్గ సీతారామాలయంలో బీదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు, మునిసిపల్ కమిషనర్ ఎన్.రామారావు, టీడీపీ నాయకులు లొడగల కామేశ్వరరావు యాదవ్, గాలి కృష్ణారావు, గురిటి సూర్యనారాయణ, సప్ప నవీన్, టంకాల రవిశంకర్ గుప్తా, శాసనపురి మురళీకృష్ణ, ఎం.నరేంద్ర, అంబటి కృష్ణమూర్తి, దడియాల నర్సింహులు పాల్గొన్నారు.


సోంపేట: లచ్చన్న విగ్రహానికి నివాళులర్పిస్తున్న శివాజీ

బడుగువర్గాల ఆశాజ్యోతి లచ్చన్న

పలాస రూరల్, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): బడుగువర్గాల ఆశాజ్యోతి సర్దార్ గౌతు లచ్చన్న అని, ఆయన ఆశయ సాధనకు అంతా కృషి చేయాలని కాశీబుగ్గ డీఎస్పీ వెంకటఅప్పారావు అన్నారు. కిష్టుపురం గ్రామంలో గౌతు లచ్చన్న జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బూర్లె కృష్ణంరాజు, తమ్మినాన గంగారామ్, వడ్డి యాదగిరి, బి.విజయ్‌కుమార్, సుదర్శనరావు, డిల్లీరావు పాల్గొన్నారు.


శ్రీకాకుళం కల్చరల్: గౌతు లచ్చన్న విగ్రహం వద్ద నివాళుర్పిస్తున్న దృశ్యం


పలాస రూరల్: కిష్టుపురంలో నివాళులర్పిస్తున్న డీఎస్పీ వెంకటఅప్పారావు


పలాస: కేటీ రోడ్డులో లచ్చన్న విగ్రహానికి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు